క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ప్రస్తుత అకాల వర్షాల కారణాంగా వారం రోజులపాటు తరచూ మండలంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు తెలిపారు. మండలంలోని కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తూరు, వడిచర్ల, సమీపంలోని గిరిజన తండాలకు బుధవారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, అలాగే 11కేవీ లైన్‌లో ఉన్న మహంతీపూర్, జానకంపల్లి, దుప్చర్ల గ్రామాలకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ తీగలకు చెట్లు అంతరాయంగా ఉండటంతో మరమ్మతు పనులకు ఈ నెల 30వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ పేర్కొన్నారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధితులకు న్యాయం చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంటలో సోమవారం కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని రెవెన్యూ ఉద్యోగులకు మంగళవారం వినతి పత్రం అందించారు. గ్రామంలో గాజుల బసమ్మ ఇంటితో పాటు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం కూలిపోయిందని డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు మున్సిపల్ కౌన్సిలర్ రమేశ్ తెలిపారు. గ్రామంలో పర్యటించి బాధితులకు ప్రభుత్వం తరపున పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చందు, మోహన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

దౌల్తాబాద్: మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు దస్తమ్మ ఇటీవల మరణించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం ఐసీడీఎస్ తరపున రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో కొడంగల్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్‌లు ప్రభ, మనిమాల తదితరలున్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



చిన్నారులకు ప్లేట్లు అందజేస్తున్న పోలీసులు

బంట్వారం: కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గొల్ల పరమేష్ తన కూతురు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బంట్వారం జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సుమారు 350 ప్లేట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటూ ఆయన ఆకాంక్షించారు. తన కూతురు ప్రణవి పుట్టినరోజు సందర్భంగా ప్లేట్లు పంపిణీ చేసిన పరమేష్‌కు ఎస్సై శ్రీశైలం, ఎంఈఓ చంద్రప్ప, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, సీఆర్పీ నర్సింలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

యాలాల: రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్టలో రకాలైన జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి యాదగిరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కేంద్రం ద్వారా సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. జనుము 40 కిలోల బస్తా మార్కెట్‌లో రూ.3,620లు ఉంటే సబ్సిడీపై రైతుకు రూ.1,448కి అందిస్తామన్నారు. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తాకు మార్కెట్‌లో రూ.2,790 కాగా రైతు రూ.1,116 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు అవసరమున్న రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఆయా క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించి తీసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కద్లాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కేశని జంగయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధితుడికి మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.10 లక్షల ఎల్ఓసీ చెక్కుమంజూరు చేయించారు.

వంతెన.. చింత తీరేనా?

ఏళ్లు గడుస్తున్నాయి.. కాంట్రాక్టర్లు మారుతున్నారు.. కానీఆ ప్రాంతవాసుల వెతలు మాత్రం తీరడం లేదు. మండలంలోని స్టేషన్ ధారూరు–దోర్నాల్ మధ్యన కాగ్నా నదిపై నిర్మిస్తున్న వంతెన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రజాప్రతినిధుల హామీలు నీటి మీద రాతలు అవుతున్నాయి.

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని నిర్మాణం
- వానాకాలంలో పొంచి ఉన్న ముప్పు
- 6కు.. 40 కి.మీ చుట్టి వస్తున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కాగ్నా నదిపై ఆగిపోయిన వంతెన నిర్మాణ పనులు

ధారూరు: కాగ్నా నదిపై మండల పరిధిలోని స్టేషన్ ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్యన ఉన్న పాత వంతెన 2016లో వరద ప్రవాహానికి పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలకు అవరోధంగా మారడంతో పాత వంతెనను ధ్వంసం చేసి రూటు మార్చి కొత్తగా రోడ్డు ఏర్పాటు చేశారు. అనంతరం నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2017లో రూ.4.70 కోట్లు మంజూరు చేసింది. అదే ఏడాది పనులు మొదలు పెట్టినా నేటికి పూర్తికాకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఏటా ఇదిగో పూర్తి చేస్తామని అధికారులు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా పరిస్థితి నెలకొంది. వంతెన పక్కనే నిర్మించిన డైవర్షన్ రోడ్డుపై వేసిన సీసీ పైపులు, మట్టి ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుకపోయింది. దీంతో స్టేషన్‌ధారూరు నుంచి దోర్నాల్ వెళ్లే ప్రయాణికులు 6 కిలోమీటర్ల దూరానికి 40 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి వస్తున్నారు. దూరభారం భరించలేక నదిలోంచి వెళ్లే ప్రయత్నం చేసిన ఇద్దరు దుర్మరణం చెందారు. అనేక పశువులు, మేకలు, గొర్రెలు వరదలో కొట్టుకుపోయాయి. మెథడిస్ట్ జాతరకు కూడా తీవ్ర ఆటంకం కలిగిస్తోంది.

మూడో కాంట్రాక్టర్

వంతెన నిర్మాణంలో 2017 నుంచి కాంట్రాక్టర్లు మారుతూ వస్తున్నారు. చివరకు మూడో కాంట్రాక్టర్‌కు రూ.1.60 కోట్ల పనులు చేస్తే రూ.1.30 కోట్లకు మాత్రమే అధికారులు ఎంబీ రికార్డు చేశారు. వాటికి సంబంధించి నగదు రాకపోవడంతో పనుల నిలుపుదలకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడో కాంట్రాక్టర్ నవంబర్ 2023లో కాగ్నా నదిపై నిర్మించిన పిల్లర్లపై 24 గట్టర్లు ఎక్కించి పూర్తి చేశారు. ఇక పనులు ఊపందుకుని నిర్మాణం పూర్తి అవుతుందని అందరూ భావించారు. బిల్లు రాలేదనే భావనతో కాంట్రాక్టర్ అప్పుడే పనులను నిలిపివేశారు. దీనిపై రోడ్లు, భవనాలశాఖ అధికారులలో మాత్రం ఎలాంటి చలనం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రూ.2.70 కోట్ల ప్రతిపాదనలు

పిల్లర్లపై గట్టర్లు వేసిన వెంటనే చేసిన పనులకు బిల్లు చేసి ఎంబీ రికార్డు పంపించామని అధికారులు ప్రకటించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవతో వంతెనకు ఇరువైపులా రోడ్డు నిర్మాణానికి మరో రూ.2.70 కోట్లు ప్రతిపాదనలు అధికారులు ఫిబ్రవరిలో పంపించారు. త్వరలో ఆమోదం లభిస్తుందని వారు భావిస్తున్నారు. అసలు అదనపు నిధులు వచ్చాయా.. కాంట్రాక్టర్ చేసిన పనులకు



వంతెన సమీపంలో నిల్వ చేసిన సామగ్రి

బిల్లు వచ్చిందా.. అనేది స్పష్టంగా చెప్పడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు ఆగిపోయే ప్రసక్తి లేదని తాండూర్ ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్ ప్రజాప్రతినిధులకు చెబుతున్నా.. పనులు స్తబ్దుగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముంచుకొస్తున్న వానాకాలంతో సర్పన్‌పల్లి, లక్నాపూర్ ప్రాజెక్టులు నిండిపోయి అలుగు పారి సమీప గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి వంతెన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు వేగంగా పూర్తిచేయాలి



మంచికుంట తండాలో పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి సరళాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్, రాంరెడ్డిపల్లి, మంచికుంట తాండ, తదితర గ్రామాలలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమయ్యేందుకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పనులు నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ కమిటీలు పనుల్లో వేగాన్ని పెంచాలని పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరం అందమైన, ఆహ్లాదకరమైన అన్ని సౌకర్యాలతో కూడిన బడులలో చిన్నారులు విద్యనభ్యసించేందుకు పాఠశాలలను సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ ఖరీం, ఏపీఎం శోభ, స్థానిక మహిళ సమాఖ్య సిబ్బంది, అమ్మ ఆదర్శ కమిటీల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



సూచనలు ఇస్తున్న ఏఎస్‌ఐ సూర్యనారాయణ

దోమ: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహనను పెంపొందించుకోవాలని ఏఎస్‌ఐ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలో ప్రయాణికులకు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా వారి వాహనాలకు సంబంధించిన ధ్రువ పత్రాలను తమవద్ద ఉంచుకోవాలన్నారు. చిన్నారులకు వాహనాలను ఇవ్వరాదని, ఇస్తే వాహనాలు కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాంలు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

దోమ మండల ప్రత్యేకాధికారి హన్మంతరావు

దోమ: పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని దోమ మండల ప్రత్యేకాధికారి హన్మంతరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విద్యార్థినీల యూనిఫాం(ఏకరూప దుస్తులు)లను కుడుతున్న వారి దగ్గరకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా వారు దుస్తులను కుట్టాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని బాలికల పాఠశాల దగ్గరకు వెళ్లి అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలలో జరుగుతున్న పనులన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా అమ్మ ఆదర్శ కమిటీలు, మహిళ సమాఖ్య సిబ్బంది ముందుకు సాగాలన్నారు. కారక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, ఎంఈఓ హరిశ్చందర్, ఎంపీఓ సోమేశ్వర్, ఏపీఎం సురేష్, సీసీలు జంగయ్య, లక్ష్మారెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వి‍త్తనాలకు రసీదులు తప్పనిసరి

ఏడీఏ రుద్రమూర్తి



దుకాణంలో తనిఖీ చేస్తున్న రుద్రమూర్తి

బొంరాస్‌పేట: మండలంలోని వ్యవసాయ విత్తనాలు, ఎరువుల దుకాణాదారులు కొనుగోలు చేసే రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని తాండూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు సీహెచ్. రుద్రమూర్తి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన రైతులకు రైతుపేరు, ఊరు, ధర, ఫోన్‌నంబరుతో కూడిన రసీదును రైతులకు ఇవ్వాలని సూచించారు. దుకాణాదారులు ఇవ్వకున్నా రైతులు అడిగి తీసుకోవాలన్నారు. తాము కొనుగోలు చేసి వాడిన విత్తనాలు, ఎరువుల, మందులకు సంబంధించిన కవర్లు రైతులు భద్రపర్చుకోవాలన్నారు. దుకాణాల్లో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మరాదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఓ అనురాధ ఉన్నారు.

నీళ్లు లేక.. పంటలు ఎండి



పెద్దేముల్‌లో నీరు అందక ఎండుతున్న చెరుకు పంట

పెద్దేముల్: మండుతున్న ఎండలకు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇప్పటికే చెరువులు, కుంటలు ఏడారులుగా మారాయి. దీంతో సాగు చేసిన పంటలు వాడిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని పెద్దేముల్, తట్టెపల్లి, జైరాంతండా, గాజీపూర్, పెద్దేముల్, బుద్ధారంతో పాటు పలు గ్రామాలల్లో రైతులు సుమారు 1500ల ఎకరాల వరకు చెరుకు పంటలు సాగుచేశారు. ఏటా సమృద్ధిగా పంటలకు నీరు అందేది. ఈ ఏడాది ఏప్రిల్ మాసం నుంచే భూగర్భ జలాలు అడుగంటడం మొదలయ్యాయి. గత పది రోజుల నుంచి చెరుకు పంటలు వాడి పోతుండడంతో అన్నదాతలు విలపిస్తున్నారు. కనీసం చెరువులల్లో చుక్క నీరు లేదు. ఐదు ఎకరాలు సాగు చేసిన రైతులు మూడు ఎకరాలకు, మూడు ఎకరాలు సాగు చేసిన రైతులు ఒక్క ఎకరాకు సాగు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని పలు రైతులు వాపోతున్నారు. కరెంటు కూడా ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఎప్‌సెట్‌లో తాండూరు విద్యార్థిని సత్తా



వైష్ణవి

తాండూరు టౌన్: ఇటీవల విడుదలైన టీఎస్ ఎప్‌సెట్ ఫలితాల్లో తాండూరు పట్టణానికి చెందిన వైష్ణవి 413వ ర్యాంకు సాధించారు. పట్టణంలోని గ్రీన్ సిటీలో నివాసం ఉంటున్న శివకుమార్, అన్నపూర్ణ దంపతుల కుమార్తె అయిన వైష్ణవి స్థానికంగా ఉన్న శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పదోతరగతి, హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివారు. ఈ సందర్భంగా డాక్టర్ అయి పేదలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని విద్యార్థిని తెలిపారు. ఎప్‌సెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన వైష్ణవిని పలువురు అభినందించారు.

గోవిందరావుపేటలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

యాలాల: యాలాల అనుబంధ గ్రామమైన గోవిందరావుపేటకు మంజూరైన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త స్తంభాలను మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లగా గ్రామానికి ఉన్న కరెంటు కష్టాలు తీరనుండటంతో సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి ప్రత్యేక కృషితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవ చూపి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా, నాయకులు నాగయ్య, మోయిజ్, చిన్న, అహ్మద్, శేఖర్, లాలు, సుదర్శన్, ఉమేష్, బాలప్ప, కిష్టప్ప, సాయిలు, బీములు, లింగప్ప ఉన్నారు.

పాత్రికేయుడి కుటుంబానికి చేయూత



కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న యూనియన్ నాయకులు

బొంరాస్‌పేట: ఇటీవల అకాల మరణం చెందిన మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు ఉప్పరి వెంకటయ్య కుటుంబానికి మంగళవారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు ఆర్థికసాయం అందజేశారు. సంతాపదినం సందర్భంగా యూనియన్ నాయకులు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భార్య, కూతుళ్లను ఓదార్చారు. పత్రికా రంగంలో వెంకటయ్య చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. కుటుంబ సభ్యులకు రూ.15 వేల నగదు అందించారు. కార్యక్రమంలో ఐజేయూ కొడంగల్, బొంరాస్‌పేట, కోస్గి మండలాల నాయకులు ఉన్నారు.

దుద్యాలలో సమస్యల తిష్ట



గొల్లగేరిలో వీధి దుస్థితి

- సీసీరోడ్ల నిర్మాణం లేక అస్తవ్యస్తం
- కొత్త మండలమైనా తీరని వెతలు

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలో మెజార్టీ గ్రామ పంచాయతీగా ఉన్న దుద్యాల నూతనంగా మండలంగా ఏర్పాటైంది. మండల కేంద్రంగా మారినప్పటికీ మౌలిక వసతుల కల్పనలో అధికార యంత్రాంగం విఫలమైంది. కొత్త మండల కేంద్రంలో ప్రజలు సమస్యలతో సావాసం చేస్తున్నారు. దుద్యాలలో గొల్లగడ్డ, తెలుగుగడ్డ, ఎస్సీకాలనీ, మీదిగేరి, లాల్‌కోటగల్లి, మున్నూర్‌గేరి, గౌడకాలనీ, ముస్లింవాడ, కిందిగేరి, మోత్కుపల్లిగడ్డ ఇలా పలురకాల కాలనీలున్నాయి. 12 వార్డులతో గ్రామపంచాయతీ పాలన నిర్వహణ కొనసాగుతోంది. వీటిలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక దుర్గంధం వ్యాప్తి చెందుతుంది.

మురుగు కాల్వలు లేక..

మండల కేంద్రంగా ఏర్పాటైనప్పటికీ ఇంకా పలు కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వలు లేవు. దీంతో మురుగు వెళ్లే మార్గంలేక రోడ్డుపైనే పారుతూ



అసంపూర్తిగా జెడ్పీహెచ్‌ఎస్ అదనపు భవనం

అస్తవ్యస్తంగా వీధులు దర్శనమిస్తున్నాయి. మండలంగా మారినా సమస్యలు తీరడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇదివరకు తాగునీటి సమస్య తీరకపోవడంతో జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లిందని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్ స్తంభాలు సరిపడా లేవని కాలనీవాసులు తెలుపుతున్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తుదారులు చేసుకోని వారు చాలా మంది ఉన్నారు. ప్రత్యేక పాలనలోనూ అధికారులు దరఖాస్తులు స్వీకరించాలని కోరుతున్నారు.

అసంపూర్తితో అవస్థలు



మా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం నిర్మాణానికి 2013–14లో రూ.28లక్షల నిధులు మంజూరయ్యాయి. రూ.10లక్షలతో పనులు చేసినా పదేళ్ల నుంచి అసంపూర్తిగానే భవనం ఉంది. అధికారులు చొరవ తీసుకొని ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– అక్షిత, విద్యార్థిని, దుద్యాల

గ్రంథాలయం ముఖ్యం



మా ఊరు మండల కేంద్రంగా మారడంతో గ్రామంలో సమస్యలు తీరుతాయని కలలు కన్నాం. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యావంతులు చదువుకోవడానికి పోటీ పరీక్షలు రాయడానికి గ్రామంలో గ్రంథాలయం లేదు. వెంటనే దాన్ని ఏర్పాటు చేయాలి.

– శివవర్ధన్, స్థానికుడు

ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి



ప్రత్యేక మండలంగా ఏర్పడటం అదృష్టంగా భావించాం. కాగా ప్రజాప్రతినిధులు, అధికారులు మండల కేంద్రంలో ఉన్న సమస్యలను తీర్చేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలి. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. రాజకీయం కన్నా అభివద్ధి అవసరం.

– శ్రీకాంత్, స్థానికుడు



పరిగి: మాజీ ప్రధాని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

వర్ధంతి సందర్భంగా నేతల ఘన నివాళి

పరిగి: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి అన్నారు. మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రిగా దేశానికి అంకితభావంతో పనిచేశారన్నారు. గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా అధికార వికేంద్రీకరణ చేశారన్నారు. ఓటు హక్కును 21 సంవత్సరాల నుంచి 18 ఏళ్లకు కుదించి ఓటు హక్కు కల్పించిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు జగన్, రామకృష్ణారెడ్డి, యదయ్య తదితరులు పాల్గొన్నారు.

మన్నేగూడలో

పూడూరు: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని పూడూరు పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్నేగూడ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, శ్రీనివాస్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అజీంపటేల్, శ్రీనివాస్, ఆరీష్, లక్ష్మణ్, బాలమణి, ఉబాన్, మోహిన్, వెంకట్‌రెడ్డి, నర్సింలుగౌడ్, శేఖర్‌గౌడ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.



యాలాల: మండల కేంద్రం వద్ద..

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం పెద్దేముల్‌లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రియాజ్, శోభరాణి, నషీర్, బాలప్ప, ఎల్లారెడ్డి, రవిశంకర్, ఆనందం, నర్సిములు, గోపాల్, వెంకటరెడ్డి, నహీం పాల్గొన్నారు.

యాలాల మండల కేంద్రంలో..

యాలాల: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న, మోయిజ్, అహ్మద్, చందు, మారుతీ, ఖాసీం, నర్సింహులు, ఉమేష్, నబీ,రజాక్, రాములు తదితరులు ఉన్నారు.



పూడూరు: పార్టీ కార్యాలయం వద్ద..



పెద్దేముల్: నివాళులర్పిస్తున్న నాయకులు